www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 26 జులై 2025
5
తిరుపతి



జర్నలిజంలో ఆర్‌టిఐ కమిషనర్ రెహనాకు డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్

పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఆర్టీఐ కమిషనర్ రెహనా బేగం పీహెచ్డీ పూర్తి చేశారు. గతంలోనే థీసిస్ సమర్పించిన ఆమె ఇవాళ విశ్వవిద్యాలయంలో వైవా ప్రజెంటేషన్ ను విజయవంతంగా పూర్తి చేశారు. అనంతరం జర్నలిజం అండ్ కమ్యూనికేషన్ లో రెహనాకు పీహెచ్డీ అవార్డు చేస్తున్నట్లు విశ్వవిద్యాలయం ప్రకటించింది. ప్రెజెంటేషన్ కు హాజరైన వైవా కమిటీ, ఆమె రీసెర్చ్ గైడ్ ప్రొ. నీలిమా, ఇతర ప్రొఫెసర్లు రెహనాను అభినందించారు.

'పేదల జీవితాల్లో వెలుగులు నింపుతాం.. పేదరికంపై యుద్ధం' అని ప్రభుత్వం తీసుకొచ్చిన 'పీ4' పథకం (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్) అధికారులకు చుక్కలు చూపిస్తోంది. 'ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చింది' అన్న చందంగా మార్గదర్శకులను ఒప్పించేందుకు అధికారులు తంటాలు పడుతున్నారు. ఇప్పటికే జిల్లాలో దాదాపు వెయ్యి మంది మార్గదర్శకులను గుర్తించారు. వారిని ఒప్పించేందుకు అధికారులకు ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. 'మీరు ఏం చేస్తారో తెలీదు, కచ్చితంగా మార్గదర్శకులను వెతికి వారిని ఒప్పించాల్సిందే' అని తీవ్ర ఒత్తిడి చేస్తోంది.

4 మార్గదర్శకులకై ఫీ(పా)ట్లు
అధికారుల 'అన్వేషణ'
వార్డు సభల్లోనూ ముందుకురాని వైనం



పి4 అమలులో భాగంగా తిరుపతి నక్కల కాలనీని దత్తత తీసుకున్న కలెక్టర్ వెంకటేశ్వర్లు (ఫైల్)

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జిల్లాలో భారీ ఆదాయ సమకూర్చే సంస్థలు, పరిశ్రమలు సామాజిక కార్యక్రమాలను చేపట్టలేకపోతున్నాయి. తాజాగా సిఎం తిరుపతి పర్యటనలోనూ మార్గదర్శకులు వేళ్లమీద లెక్కపెట్టేలా ఇద్దరు ముగ్గురే ఉండటం గమనార్హం. జిల్లాలోనూ కలెక్టర్ ఆధ్వర్యంలో మార్గదర్శకులతో సమీక్షలు జరుగుతూనే ఉన్నాయి. తిరుపతి జిల్లాలో మొత్తం 6,372 మంది బంగారు కుటుంబాలు ఉన్నట్లు గుర్తించామని కలెక్టర్ వెల్లడించారు. తిరుపతి కార్పొరేషన్ పరిధిలో 632 మంది ఉన్నారు. వీరిని కోటీశ్వరులు చేయడానికి పారిశ్రామికవేత్తలను, వ్యాపారులను, కోటీశ్వరులను అన్వేషించే పనిలో అధికారులు ఉన్నారు. 'స్పాన్సర్ల' కోసం డివిజన్ల వారీగా అన్వేషణ కొనసాగుతోంది. అయితే మార్గదర్శకులు ముందుకొచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

ఆర్థికంగా బలంగా ఉన్న వారి జాబితాను ఇప్పటికే సిద్ధం చేసిన అధికార యంత్రాంగం, ఖచ్చితంగా వారిని ఒప్పించే ప్రయత్నాన్ని మండల అధికారుల వరకూ బాధ్యత అప్పగించింది. ప్రభుత్వ పథకాలు అమలుకు ఎలాగోలా పనిచేయగలం గానీ, దాతలను వెతికి వారిని ఒప్పించే బాధ్యతపై అధికారులు పెదవి విరుస్తుండటం గమనార్హం. ఎవరి స్థాయిలో వారు పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, వ్యవసాయ శాఖతో పాటు అన్ని కీలక శాఖల అధికారులూ తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. దాతలను వెతకలేక డీలా పడుతున్నారు. కూటమి హయాంలో అధికారుల పరిస్థితి దారుణంగా తయారయ్యింది. విధి నిర్వహణలో టిడిపి నాయకుల ఒత్తిళ్లు ఒక ఎత్తయితే, ప్రభుత్వ పి4 అమలులో భాగంగా ప్రతి అధికారి కుటుంబాలను దత్తత తీసుకోవాలని చెప్పడం గమనార్హం. విధి నిర్వహణ చూసుకోలేక, ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోలేక అధికారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఓ వైపు తల్లికి వందనం, గ్యాస్ డబ్బులు, రైతు భరోసా నిధులు పడలేదన్న అసంతృప్తితో అర్హులు సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతూనే ఉన్నారు. మరోవైపు 2029 వరకూ ఆడబిడ్డ నిధి ప్రస్తావనే లేదు. ఆడబిడ్డ నిధి కింద జిల్లాలో నాలుగు లక్షల మంది అర్హులు ఉన్నారని అంచనా. అలాగే బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లకు సబ్సిడీ లోన్లు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం దరఖాస్తులు అనంతరం ఇంటర్వ్యూలు చేసి 'బ్రేక్' వేయడం కూటమి ప్రభుత్వంపైన అసంతృప్తికి కారణమవుతోంది.

విలీన బడుల్లో కొనసాగుతున్న నిరసనలు

పాతపాలెం దళితవాడ పాఠశాలకు తాళం
42 రోజులుగా తల్లిదండ్రుల నిరసనలు

ప్రజాశక్తి - కెవిబిపురం



కెవిబిపురం మండలం పాతపాలెం దళితవాడలోని పాఠశాలను రద్దు చేసి, ఊరిలోని పాఠశాలలో విలీనం చేయడంతో పాఠశాల తెరచిన రోజు నుంచి దాదాపు 42 రోజులుగా విద్యార్థులను పాఠశాలకు పంపకుండా తల్లిదండ్రులు నిరసనలు తెలుపుతూనే ఉన్నారు. అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో పాఠశాలకు తాళం వేశారు. తమ దళితవాడలోని పాఠశాలను తెరిపిస్తేనే తాళం తీస్తామని ధర్నా నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్ మాట్లాడుతూ అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థుల చదువుకు ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రభుత్వం చెప్పినట్లుగా పాఠశాలలను రద్దు చేస్తూ, సమీప పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల డ్రాపౌట్లు పెరుగుతున్నాయన్నారు. మారుమూల గ్రామమైన పాతపాలెం, గురుకుల కండ్రిగ, వగత్తూరు, బంగారమ్మకండ్రిగ గ్రామాల విద్యార్థులు విద్యకు దూరమై నిరక్షరాస్యులుగా మిగిలిపోయే ప్రమాదం లేకపోలేదన్నారు. జగన్మోహన్‌రెడ్డి పాలనలో వ్యతిరేకించిన టిడిపి నాయకులు, వారి హయాంలోనూ విలీనం చేయడం దారుణమన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రద్దయిన పాఠశాలను తెరిపించాలని డిమాండ్ చేశారు. లేనిచో గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు.

కొత్త వీరాపురం గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి - వెదురుకుప్పం

మా బడిని మా గ్రామంలోనే కొనసాగించాలని ఏర్పేడు మండలం, కొత్త వీరాపురం గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు మండల విద్యాశాఖాధికారుల ప్రేమలతకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడల్ స్కూల్ పేరుతో కొత్త వీరాపురం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 3,4,5 తరగతుల విద్యార్థులను ఒడ్డిమిట్ట ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయడం వల్ల అత్యంత రద్దీగా వున్న రహదారుల వెంబడి వెళ్లాలంటే భద్రత దృష్ట్యా అనేక సమస్యలని, ఎప్పుడు ఏ ప్రమాదమో ముంచుకొస్తుందోనని తల్లిదండ్రులమైన మేము ఆందోళనకు గురవుతున్నామని ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లారు. కొంతమంది విద్యార్థులు ఒడ్డి మిట్ట ప్రాథమిక పాఠశాలకు వెళ్లలేక డ్రాప్ అవుట్స్ గా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లల భవిష్యత్ దృష్ట్యా ఉంచుకుని 3,4,5 తరగతులను తమ గ్రామంలోని కొనసాగించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎంఈఓ ప్రేమలత మీ గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం వెంకటాపురం దళితవాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో ఎంఈఓ ప్రేమలత సమావేశం అయ్యారు. పిల్లలను పల్లం ప్రాథమిక పాఠశాలకు పంపాలని కోరగా, మా పిల్లలకు భద్రత ఎక్కడ? అని తల్లిదండ్రులు ప్రశ్నించారు. వేరే బడికి పంపేది లేదని ఖరాకండిగా తేల్చి చెప్పారు. బడికి వేసిన తాళం అయినా ఓపెన్ చేయాలని కోరగా, మా గ్రామంలోనే బడిని కొనసాగిస్తామని చెబితేనే ఓపెన్‌చేస్తామని గ్రామస్తులు తెగేసి చెప్పారు.



భారీగా తగ్గిన శ్రీవారి హుండీ ఆదాయం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



శ్రీవారి హుండీ ఆదాయం భారీగా తగ్గింది. గత ఏడాదితో పోల్చుకుంటే భక్తుల రద్దీ పెరిగినప్పటికీ హుండీ ఆదాయం మాత్రం మూడు కోట్ల మేర తగ్గింది.. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 3 లక్షల మంది భక్తులు ఎక్కువ దర్శనం చేసుకున్నారని తెలిపింది. అయితే హుండీ ఆదాయం మాత్రం గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది భారీగా తగ్గినట్టు టీటీడీ పేర్కొంది. ఈ ఏడాది తొలి ఆరునెలల్లో రూ.666.26 కోట్ల హుండీ ఆదాయం రాగా... గత ఏడాదితో పోలిస్తే ఇది రూ.3 కోట్లు తక్కువ. భక్తుల రద్దీలో పెరుగుదల కనిపించినప్పటికీ, హుండీ కానుకల సగటు సమర్పణలో తగ్గుదల కారణంగా ఆదాయం తగ్గింది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వివరాల ప్రకారం... గడిచిన ఆరునెలల కాలంలో సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం, ఇతర సేవల ద్వారా భక్తులకు సౌకర్యాలు కల్పించారు. 99 లక్షల మంది తలనీలాలు సమర్పించగా, 6.30 కోట్ల మంది అన్నప్రసాదం స్వీకరించారు. అలాగే 12.14 కోట్ల లడ్డూలు విక్రయించబడ్డాయి. జనవరి 1, 2025న ఒక్క రోజులోనే లక్షకు పైగా భక్తులు తిరుమల శ్రీవారిని దర్శించుకోగా.. ఆ ఒక్కరోజే రూ.3.13 కోట్ల హుండీ ఆదాయం వచ్చింది. భక్తుల సౌకర్యం కోసం టీటీడీ ఆన్‌లైన్ టికెట్స్, ప్రత్యేక ప్రవేశ దర్శనాలు (రూ.300), గదుల కేటాయింపు వంటి ఏర్పాట్లు చేసింది. అయితే రద్దీ సమయంలో వీఐపీ బ్రేక్ దర్శనాలపై కొన్ని పరిమితులు విధించింది.

ఇక తిరుమలకు అన్నీ ఎలక్ట్రికల్ బస్సులే..

5 ఎకరాల స్థలం కోరిన ఆర్టీసీ
350 బస్సులు నడిపేలా గ్రీన్‌సిగ్నల్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయం మేరకు తిరుమలలో పర్యావరణ హితం కోరుతూ కాలుష్యరహితమైన ఎలక్ట్రానిక్ బస్సులు నడిపేందుకు నిర్ణయం జరిగింది. ఈ మేరకు 350 ఎలక్ట్రికల్ బస్సులు నడపనున్నారు. ఇందుకుగాను తిరుమలలో మోడల్ బస్‌స్టేషన్ ఏర్పాటుకు 5 ఎకరాల స్థలం కావాలని టిడిని ఎపిఎస్‌ఆర్టీసి యాజమాన్యం కోరింది. ఇందుకు టిటిడి పాలకమండలి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. మొదటి విడతగా మంగళం డిపోకు 50 బస్సులు ఆగస్టు మొదటివారంలో రానున్నాయి. అయితే వాటి పార్కింగ్‌కు, ఛార్జింగ్‌కు అనువైన స్థలాన్ని పరిశీలించారు. ఎలక్ట్రికల్ పనుల కోసం ఎస్‌పిడిసిఎల్ అధికారులకు 4.5 కోట్ల రూపాయలను ఆర్టీసీ చెల్లించింది.




తిరుమల తిరుపతి మధ్య మంగళం, తిరుమల, తిరుపతి, చిత్తూరు, మదనపల్లి, పీలేరు, పలమనేరు డిపోల నుంచి, ఇతర జిల్లాల నుంచి రోజుకు 400 పైగా డీజిల్ బస్సులు రవాణా సాగిస్తున్నాయి. డీజిల్ బస్సుల కారణంగా కాలుష్యం ఎక్కువై తిరుమలలో పర్యావరణం దెబ్బతింటుందన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, టిటిడిని సూచించింది. ఈ నేపథ్యంలో ఆస్థానంలో అన్నీ ఎలక్ట్రికల్ బస్సులే తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు బోర్డులోనూ చైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరిలతో సమావేశమై తిరుమలలో అన్నీ ఎలక్ట్రికల్ బస్సులు తీసుకొస్తే తప్ప పర్యావరణాన్ని పరిరక్షించలేమని తేల్చారు. తిరుమల శేషాచలం అడవుల మధ్య ఉండటం వల్ల పక్షులు, జంతుజాలం కాలుష్యం వల్ల అటవీ పరిసరాలన్నీ దెబ్బతినే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే ఆర్నెళ్ల తరువాత తిరుమలకు డీజిల్ బస్సులు తిరిగే అవకాశమే లేదు. అన్నీ ఎలక్ట్రికల్ బస్సులే. మంగళం, తిరుపతి, తిరుమల ఈ మూడు డిపోల నుంచే తిరుమలకు బస్సులు వెళ్లనున్నాయి. బయట జిల్లాల నుంచి వచ్చే బస్సులు సైతం ఈ డిపోలకు వచ్చి లింక్ టికెట్ రూపంలో తిరుమలకు వెళ్లనున్నాయి.

'స్మార్ట్ మీటర్లపై' అపోహలు వీడండి

సందేహాల నివృత్తికి టోల్ ఫ్రీ నంబరు 1912
ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి కె. సంతోష రావు వెల్లడి

ప్రజాశక్తి - తిరుపతి సిటి



విద్యుత్ స్మార్ట్ మీటర్లపై ఎలాంటి అపోహలకు తావులేదని ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఎస్పిడిసిఎల్) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు అంశంపై వినియోగదారులు గందరగోళానికి గురికావాల్సిన అవసరం లేదని, స్మార్ట్ మీటర్ల ద్వారా వినియోగదారులపై ఎటువంటి ఆదనపు భారం పడబోదని వివరించారు. కేంద్ర ప్రభుత్వ విద్యుత్ పంపిణీ పునర్వ్యవస్థీకరణ పథకం (ఆర్ డిఎస్ఎస్)లో భాగంగా అన్ని రాష్ట్రాలు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. సంస్థ పరిధిలో ప్రభుత్వ, వాణిజ్య సర్వీసులకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సర్వీసులతో పాటు విద్యుత్ వినియోగం ఎక్కువగా వున్న గృహ వినియోగదారులకూ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు. ఈ మీటర్లను అమర్చే ముందు వాటి ప్రత్యేకతలు, ప్రయోజనాలపై వినియోగ దారులకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు సందర్భంలో వినియోగదారులు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అంతేకాకుండా విద్యుత్ నెలవారీ బిల్లులతో పాటు స్మార్ట్ మీటర్లకు సంబంధించి ఎలాంటి అదనపు చార్జీలను వసూలు చేయబోమని, ఈ నేపథ్యంలో వినియోగదారులు అపోహకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. ఎపిఎస్పిడిసిఎల్ టోల్-ఫ్రీ నంబరు: 1912కు వినియోగదారులు కాల్ చేయడం ద్వారా స్మార్ట్ మీటర్ల అంశంపై సందేహాలను నివత్తి చేసుకోవచ్చని సూచించారు.

కళాకారులకు పాత బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

కళాకారులకు అందాల్సిన పాత బకాయిలు చెల్లించి ఆదుకోవాలని రాష్ట్ర సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు ధన్యాసి పెంచలయ్యను కళాకారులు కోరారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన ఉమ్మడి చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల కళాబందాల నాయకులు, సమన్వయకర్తలు శుక్రవారం విజయవాడ ఘంటసాల ప్రభుత్వ సంగీత, నత్య కళాశాల ఆవరణంలోని సాంస్కృతిక శాఖ కార్యాలయంలో వారు సహాయ సంచాలకుని కలసి తమ సమస్యలను నివేదించుకున్నారు. 2018 - 19 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ద్వారా నిర్వహించిన జన్మభూమి - మన ఊరు, గ్రామదర్శిని కార్యక్రమాల్లో కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించి అందాల్సిన బకాయిలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసుకున్నారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన ఆరు జిల్లాల కళాకారులకు బకాయిలు చెల్లించారని, మిగిలిన జిల్లాలతో పాటు చిత్తూరు, అనంతపురం, కర్నూలు ఉమ్మడి జిల్లాల కళాకారులకు కూడా రావలసిన బకాయిలు



చెల్లించేందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రంలో కళలనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న ఎంతో మంది కళాకారులు గత ఏడేళ్లుగా ఉపాధి కోల్పోయి ఎన్నో రకాల ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వ కార్యక్రమాల్లో కళాకారులకు కళా ప్రదర్శనలు కల్పిస్తూ వారిని ప్రోత్సహించాలని కోరారు. అందుకు స్పందించిన సహాయ సంచాలకులు వీలైనంత త్వరగా బకాయయి సొమ్ము అందేటట్లు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉమ్మడి చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల సమన్వయకర్తలు ప్రవీణ్, తరిమిళ్ల రాజు, టింగ్ టింగ్ వెంకటేష్, కళాబందాల నాయకులు ఖాదర్ బాష షేక్, కలకట రెడ్డెప్ప, ఏ. ఆదినారాయణ పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్

ప్రజాశక్తి - వరదయ్యపాలెం ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ సిలై జాకి, తమ అధికారుల బందంతో కలిసి శుక్రవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్.శివశంకర్ వారికి సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలపై సమగ్ర ప్రదర్శన ఇచ్చారు. వ్యూహాత్మక స్థానం, వివిధ రంగాల పరిశ్రమలు, సామాజిక మౌళిక సదుపాయాలు, శ్రీసిటీలో పరిశ్రమల ఏర్పాటు వలన ఒనగూరే నిర్దిష్ట ప్రయోజనాలను వివరించారు. ఈ పర్యటనలో కీలకాంశంగా, కాన్సుల్ జనరల్ సమక్షంలో శ్రీసిటీలో పరిశ్రమ ఏర్పాటుకు ఆస్ట్రేలియాకు చెందిన ఇంజనీరింగ్ సంస్థ ఆక్స్ ఎయిర్ ప్రెజర్ వెసెల్స్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీసిటీ అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నాయి. పారిశ్రామిక అవసరాలకు ఉపయోగపడే వివిధ గ్యాస్ లను నిల్వ చేసే అధిక పీడన ట్యాంకులను ఈ కంపెనీ తయారు చేస్తుంది.

పొదుపు సంఘాల నిధులు
రూ.90 లక్షలు చెల్లిస్తా
మెప్మా పీడీకి ఆర్‌పి హేమలత విన్నపం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పొదుపు సంఘాల సభ్యుల డబ్బులను దొంగ రసీదులు పెట్టి స్వాహా చేసిన ఆర్పి హేమలత 90 లక్షల రూపాయలను తానే అన్ని సంఘాలకూ చెల్లిస్తానని శుక్రవారం మెప్మా పీడీకి విన్నవించుకున్నారు. ఆర్పి హేమలత సుమారు 27 సంఘాల సభ్యుల సంబంధించిన మొత్తం 90 లక్షల రూపాయలు స్వాహా చేసినట్లు ఆడిటింగ్‌లో తేలింది. స్వాహా నిధులను అన్ని సంఘాలకు ఏడాదిలోపు దశల వారీగా చెల్లిస్తానని, అలాగే సంఘానికి సంబంధించిన పుస్తకాలు, ట్యాబ్లు తిరిగి ఇస్తానని ఆర్పి హేమలత రాతపూర్వకంగా మెప్మా పీడీకి తెలియజేశారు. సంఘంలో ఉండే సభ్యులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తాను స్వాహా చేసిన డబ్బులు చెల్లిస్తానని బాండ్ పేపర్లో సంతకాలు చేసి ఇచ్చారు. 15 రోజుల క్రితం ఆర్పి హేమలత సంఘానికి సంబంధించిన డబ్బులు స్వాహా చేశారని పెద్ద ఎత్తున సభ్యులు ఆందోళన చేయడంతో మెప్మా అధికారులు మేల్కొనడం గమనార్హం.

బధిర పాఠశాలలో చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బధిర పాఠశాలలో చిత్రలేఖనం పోటీలను నెల్లూరి మునిలక్ష్మి, బధిర పాఠశాల డ్రాయింగ్ టీచర్ నాగమణి పర్యవేక్షణలో శుక్రవారం నిర్వహించారు. 'ప్లాస్టిక్ వద్దు' అనే అంశంపై సీనియర్లకు 'భూమాతను కాపాడుకుందాం' అంశంపై జూనియర్లకు పోటీ నిర్వహించారు. మూడు కేటగిరీల్లో పోటీలు జరిగాయని ప్రిన్సిపాల్‌రమణమూర్తి తెలిపారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వంద స్కూళ్లల్లో వివిధ అంశాలపై పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎం.నాగార్జున ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విజేతలకు ఆగస్టు 15న బహుమతులను అందజేస్తారు.





పెన్షనర్ల మానవహారం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పెన్షనర్లకు హాని కలిగించే బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, ఎనిమిదో వేతనం వెంటనే అమలు చేయాలని ఏఐబిడిపిఎ జిల్లా కార్యదర్శి వైఎస్ రాజు, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్స్ పిలుపు మేరకు నేషనల్ ఫోరమ్ ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్స్ తరుపున 11 గంటల దగ్గర నుండి 12 గంటల వరకు తిరుపతి గాంధీ రోడ్డు నాలుగు కాళ్ళ మండపం దగ్గర వద్ద పెన్షనర్స్ మానవహారం నిర్వహించారు. వాలిడేషన్ ఆఫ్ పెన్షనర్స్ యాక్ట్ అనగా పెన్షనర్స్ కు భవిష్యత్తులో జరగబోయే పే రివిజన్లో లో వేజ్ రివిజన్ జరగదు. ఇది చాలా ప్రమాదకరమైన యాక్టు. అందువల్ల ఈ యాక్ట్ ని వెంటనే రద్దు చేయాలని . అన్ని డిపార్ట్మెంట్స్ పెన్షనర్స్ ఈ మానవహారం లో పాల్గొని విజయవంతం చేశారు. పిడబ్లుఎ సహాయ జిల్లా కార్యదర్శి గురప్ప, గోవిందా స్వామి, రిటైర్డ్ అధికారుల సంఘ కార్యదర్శి వెంకటయ్య, నాయకులు రంగయ్య, రైల్వే పెన్సనర్ల అసోసియేషన్ కార్యదర్శి జయంత కుమార్ పాల్గొన్నారు.

తుడా నిధులతో అభివృద్ధి : డాలర్స్ దివాకర్ రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తుడా నిధులతో తొమ్మిది నియోజకవర్గాలను అభివద్ధి చేయనున్నట్లు చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి తెలిపారు. ఏ డే విత్ తూడా చైర్మన్ కార్యక్రమాన్ని శ్రీకాళహస్తిలో స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ముందుగా ఏపీ సీడ్స్ వద్దకు చేరుకొని ఎన్టీఆర్ పార్కును తుడా నిధులతో అభివద్ధి చేయాలని నిర్ణయించారు. అక్కడే స్వర్ణముఖి ఈట్ ఫుడ్స్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అనంతరం తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ఇరువురు బైక్ పైన పట్టణంలో పర్యటిస్తూ సమస్యలను గుర్తించారు. ముఖ్యంగా డ్రైనేజీ సమస్యలు, తాగునీటి సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేశారు. ఇరువురు అక్కడికక్కడే అధికారులను పిలిపించి, డ్రైనేజీ మరమ్మతులు, త్రాగునీటి పైప్లైన్ల కోసం ఎస్టిమేషన్లు తయారుచేసి ప్రతిపాదనలు సిద్ధం చేయమని ఆదేశించారు. పట్టణంలోని మురుగునీటిని మొత్తం పైపులైన్ల ద్వారా ఎస్టిపి ప్లాంట్ కు చేర్చే ప్రతిపాదనలు చేశారు. అనంతరం శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్ కి చేరుకొని అక్కడి మౌలిక వసతుల కల్పన కోసం చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా తుడా నిధులతో ఆస్పత్రి ఆవరణలో గ్రీనరీ ఏర్పాటు చేయాలని తుడా చైర్మన్ అధికారులకు ఆదేశించారు. జయ రామారావు వీధిలో పురాతన డ్రైనేజీ కాలువలను ఆధునికరించి డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచడానికి పరిశీలించారు. పారిశుధ్య కార్మికుల ను డ్రైనేజ్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి మున్సిపల్ పారిశుధ్య కార్మికులను తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ఘనంగా సత్కరించారు. అనంతరం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తిరుపతి తుడా అధికారులను సన్మానించారు. డ్రైనేజీ కాలువ ల అభివద్ధికి ఐదు కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్లాస్టిక్ ను నిషేధించాలనీ, వాడితే జరిమానా తప్పదని హెచ్చరించారు. కరకంబాడి గ్రామాభివృద్ధికి కోటి 50 లక్షల నిధులు ఇస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. తారకరామనగర్‌లో ప్లాట్లు రి వెరిఫికేషన్ చేయిస్తామన్నారు.



28న టిటిడి పాఠశాలల్లో 'సద్గమయ'

ప్రజాశక్తి - తిరుపతి సిటి


తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్తంగా జూలై 28వ తేదీన టిటిడి పాఠశాలల్లోని విద్యార్థులకు మానవీయ, నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇచ్చేందుకు సద్గమయ కార్యక్రమాన్ని చేపడుతోంది. సద్గమయ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, ఆధ్యాత్మిక, సామాజిక, నైతిక విలువలు, నైపుణ్యాలు, సంస్కృతి - సాంప్రదాయాలు, వాస్తవ ప్రపంచాన్ని అధ్యయనం చేయడం, వ్యక్తిగత పురోగతి, సామరస్యం, సమాజంలో భాగస్వామ్యం, నాయకత్వ లక్షణాలు తదితర అంశాలపై విశ్లేనాత్మకంగా శిక్షణ పొందిన 70 మంది ఉపాధ్యాయులచే శిక్షణ ఇవ్వనున్నారు. తిరుపతి, తిరుమలలోని 7 పాఠశాలల్లో డే స్కాలర్లకు రోజుకు ఒక గంట చొప్పున 4 రోజుల పాటు సద్గమయ శిక్షణా కార్యక్రమం ఉంటుంది.


బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీలో...

మునిరాజా, ఎండి శ్రీనివాసులుకు చోటు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

గుంటూరులో ఎనిమిదో ఏపీ బిల్డింగ్ అండ్ అదర్స్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు ఈనెల 23, 24 తేదీల్లో జరిగాయి. ఈ మహాసభలో తిరుపతి జిల్లాకు చెందిన మునిరాజా, ఎండి శ్రీనివాసులు ఎన్నికైనట్లు సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రమణ్యం ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీలో వీరు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు. బిల్డింగ్ వర్కర్స్ సమస్యలపై వీరు పోరాటాలు చేస్తారని పేర్కొన్నారు





వ్యాయామంతో బ్రెయిన్‌కు రక్షణ : డాక్టర్ రమాదేవి

ప్రజాశక్తి - రేణిగుంట

వ్యాయామంతో మెదడు దెబ్బతినకుండా ఆరోగ్యంగా పరిరక్షించుకోవచ్చని డాక్టర్ రమాదేవి తెలిపారు. శుక్రవారం ప్రపంచ బ్రెయిన్ డే పురస్కరించుకుని అమర ఆస్పత్రిలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అమర ఆస్పత్రిలో అత్యాధునిక పరికరాలు ఉన్నాయని, అయితే రోగులు తప్పకుండా ప్రతిరోజూ వ్యాయామం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నరాలు దెబ్బతినకుండా రోగులు జాగ్రత్తలు పాటించాలన్నారు. రోజువారి వ్యాయామం, యోగా, వాకింగ్, ఎక్సర్‌సైజ్‌ల వల్ల ఒత్తిడి తగ్గించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ వి.బాలకృష్ణనాయక్, చైర్మన్ డాక్టర్ ప్రసాద్ గౌరనేని, సిఓఓ భాగ్యలక్ష్మి, శ్రీధర్ న్యూరాలజీ హెచ్ఓడి పాల్గొన్నారు.

నిరంతర సేవా కార్యక్రమాలు.. ఆదర్శనీయుడు పిసి రాయల్



కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు, టిటిడి బోర్డు మెంబర్ భాను ప్రకాష్ రెడ్డి, రుద్రరాజు శ్రీదేవి, బండి మధుసూదన్ రెడ్డి, సామంచి శ్రీనివాస్, ఎంఎల్ నాయుడు, డాక్టర్ ఎఆర్ రెడ్డి, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ప్రముఖ పారిశ్రామి కవేత్త, కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పిసి రాయల్ పుట్టినరోజు సందర్భంగా నగరంలో శుక్రవారం విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించా రు. శిల్పారామం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తిరుమల శ్రీవారిని దర్శించుకుని అన్నదానం ట్రస్టుకు పది లక్షల రూపాయలు విరాళాన్ని అందజేశారు. తిరపతి గాంధీ రోడ్ లోని కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ కార్యాలయం వద్ద, బైరాగి పట్టెడలో అన్నదానం చేశారు. శుక్రవారం కచ్చిపి ఆడిటోరియంలో నిర్వహించిన పుట్టినరోజు వేడుకలకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా విచ్చేసి పిసి రాయల్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డాక్టర్ పిసి రాయల్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రముఖ హీరోయిన్ డాక్టర్ నిరోషా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని అనేక రంగాల్లో పలు బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ పిసి రాయల్ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. డాక్టర్ పిసి రాయల్ మాట్లాడుతూ గత ఇరవై సంవత్సరాలకు పైగా కస్తూర్బా గాంధీ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కస్తూర్బా గాంధీ ట్రస్ట్ నిర్వహణ బాధ్యతలు తనకు అప్పగించడం, తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజా సేవకు కట్టుబడి ఉన్నానని తెలిపారు. ఈ

పాఠశాలల విలీనం.. లోకేష్ పాపం: నూకతోటి



ప్రజాశక్తి - కేవీబి పురం: కేవీబీపురం మండలంలో బడుల విలీనం సమస్యపై సత్యవేడు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త నూకతోటి రాజేష్ తీవ్రంగా స్పందించారు. పాతపాలెంలో విలీనమైన బడులను శుక్రవారం ఆయన సందర్శించారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆవేదనను నేరుగా తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ, నాడు నేడు పథకం కింద అభివృద్ధి చెందిన పాఠశాలలను వదిలేసి, కనీస వసతుల్లేని బడులకు విద్యార్థులను బదిలీ చేయడం దారుణమన్నారు. 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న బడులకు పిల్లలు ఎలా వెళ్లగలరని ప్రశ్నించారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు తెలియజేసినా, వారు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ చర్యలతో డ్రాప్ ఔట్లు పెరుగుతాయన్నారు. డీఈఓ తక్షణమే స్పందించి పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గవర్ల కృష్ణయ్య, నందకుమార్, మాధవి రెడ్డి, లాల్ బాబు యాదవ్,శ్రీనివాస యాదవ్,గిరి, మనీ, హరి, అయ్యప్ప,బాల మరియు నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రామారావును బదిలీ చేయాలి

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: సిఐటియు ఆధ్వర్యంలో అక్రమాల రామారావును వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారం నాటికి 37వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా గత పది సంవత్సరాల నుండి వెంకటగిరి మున్సిపాలిటీ లోనే శానిటరీ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్విస్తున్న రామారావుని వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. రామారావుని వెంకటగిరి నుండి బదిలీ చేసేంతవరకు సిఐటియు ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుబ్బయ్య, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, సుబ్బరత్నమ్మ, రమణయ్య, మణి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - నాగలాపురం : శుక్రవారం నాగలాపురంలో అక్బర్ బాషాకు రూ.75 వేలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాగలాపురం మండలం టి పి కోటకు చెందిన అక్బర్ బాషా అనారోగ్యంతో బాధపడుతూ, చికిత్స కోసం అప్పులు చేశానని ఆదుకోవాలని కోరారన్నారు. బాధితుని ఆసుపత్రి ఖర్చులతో కూడిన బిల్లులను ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయగా తక్షణం మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు.

ఉచిత వృత్తి శిక్షణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్రీయ సేవా సమితి రాజ్ ఆధ్వర్యంలో ప్రాంతీయ శాఖ పుత్తూరు కార్యాలయంలో శుక్రవారం టైలరింగ్, బ్యూటిషన్ కోర్సులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టైలరింగ్‌కు అవసరమైన పనిముట్లు, బ్యూటిషన్ కోర్సుకు అవసరమైన వస్తువులను ఉచితంగా అందించారు. 20 మంది మహిళలకు వంద రోజులుపాటు, రోజుకు రెండు గంటలు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జన శిక్షణ సంస్థ డైరెక్టర్ మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధిలో భాగంగా చేతివృత్తులపై శిక్షణ తీసుకుని, కుటుంబం ఆర్థిక పరిస్థితులు మెరుగు పరచుకోవాలన్నారు. అనంతరం శిక్షణ పొందిన గత బ్యాచ్ వారికి ధ్రువీకరణపత్రాలు, 8మందికి టైలరింగ్ మిషన్లు అందించినారు. ఈ కార్యక్రమంలో హరి, రవి, తేజ, జయంతి, ధన, హమీషా పాల్గొన్నారు.

శరవణన్ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం, వేలూరులో బుధవారం పడవేటమ్మ ఉత్సవానికి ఆలయం వద్ద ఇనుప పైపు పందిళ్ళు వేస్తుండగా 11 కెవి లైన్‌కి పైప్ తగిలి కరెంట్ షాక్‌తో కెశరవణన్ (46)మృతి చెందారు. విషయం తెలుసుకున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శుక్రవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంమలో మాజీ మార్కెట్ చైర్మన్ ఇళంగోవ రెడ్డి, మాజీ జడ్పిటిసి సుమాంజలి, మునిరత్నం నాయుడు, యస్ నాగరాజు, డిల్లీ, పాండియన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేఆర్ డిగ్రీ కళాశాలలో ప్రాజెక్ట్ అరణ్య

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సహకారంతో ప్రాజెక్ట్ అరణ్యలో భాగంగా శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. తపస్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ విపుల్ సింగ్, ప్రాజెక్టు కోఆర్డినేటర్ స్నేహదీప్ బిశ్వాస్‌ల సహకారంతో దేశవ్యాప్తంగా ఇప్పటికీ 52 పట్టణాలలో రెండు లక్షలకు పైగా మొక్కలు నాటి హరితదేశ ఉద్యమానికి నాంది పలికారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని పిలుపునిస్తూ తపస్ ఫౌండేషన్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయ మహేష్, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ పీర్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ నారాయణ రాజు, డాక్టర్ కోటేశ్వరరావు తదితర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

తొక్కిసలాట కేసు సిబిఐకి అప్పగించాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుపతిలో జరిగిన భక్తుల తొక్కిసలాట కేసును రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి విమర్శించారు. తిరుపతి పద్మావతి పురంలోని కరుణాకర్ రెడ్డి నివాసంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైకుంఠ ద్వార దర్శనం టోకెన్లు అందజేసేందుకు ఏర్పాటు చేసిన క్యూలైన్ల వద్ద జరిగిన తుక్కిసలాటలో 6 మంది చనిపోగా 50 మందికి పైగా గాయపడిన విషయంలో, ఏఈఓ హరినాథ్ రెడ్డి, డీఎస్పీ వెంకటరమణలను బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేశారన్నారు. జేఈఓ గౌతమిని, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడును బదిలీ చేశారని గుర్తుచేశారు. చంద్రబాబు నాయుడు ముందే అనుకున్న స్క్రిప్ట్ ప్రకారం నివేదిక అందజేయడం విడ్డూరమన్నారు. హరినాథ్ రెడ్డి, వెంకటరమణ ఇద్దరు వైసీపీకి అనుకూలురని భావించి సస్పెండ్ చేశారన్నారు. ఇప్పుడు కమిటీ కూడా వారిద్దన్నే బలి చేస్తూ నివేదిక ఇవ్వడం శోచనీయమన్నారు. ఈవో, టీటీడీ ఛైర్మన్‌లు క్షమాపణ చెప్పి చేతులు దులుపుకోవడం దారుణమన్నారు. ఈ ఘటనపై సిబిఐ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీష, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి కియా నూతన ఈవి కారు



ప్రజాశక్తి - తిరుపతి (మంగళం): ప్రముఖ కార్ల ఉత్పాదక సంస్థ కియా నూతన ఈవి మోడల్ కియా కారెన్స్ క్లావిస్‌ను చెన్నై బెంగళూరు జాతీయ రహదారి మార్గంలో ఉన్న హెూషి ఆటో ప్రైవేట్ లిమిటెడ్ కియా కార్ షోరూమ్‌లో షోరూమ్ మేనేజింగ్ డైరెక్టర్ జగన్నాథరెడ్డి మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా జగన్నాథ రెడ్డి మాట్లాడుతూ ఈవీ మోడల్‌లో మార్కెట్లోకి వచ్చిన కారెన్స్ క్లావిస్‌లో అత్యాధునిక సదుపాయాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో డైరెక్టర్లు చెరుకు నిరంజన్, భారతి, హెూషిమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామాంజులు నాయుడు పుట్టినరోజు వేడుకలు



ప్రజాశక్తి - కెవిబి పురం: కెవిబి పురం మండలం, సాయిబాబా గుడివద్ద శుక్రవారం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, టీడీపీ నాయకులు రామాంజులు నాయుడు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా రైతు కమిటీ అధ్యక్షులు గోపినాథ్ రెడ్డి, సత్యవేడు నియోజకవర్గం ఎస్సీ సెల్ అధయక్షుడు సాదు, పార్లమెంట్ యువత కార్యదర్శి సురేష్ రెడ్డి, జేనసేన మండల అధయక్షుడు థామస్, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణ అడ్డుకున్న రెవెన్యూ శాఖ అధికారులు

ప్రజాశక్తి - దొరవారిసత్రం : మండల పరిధిలోని, నెలబల్లి పంచాయతీలో ఉన్న సర్వే నెంబర్ 7 ప్రభుత్వ భూమిని (మేత పోరంబోకు భూమి) అదే గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించుకొని శుక్రవారం సాగుకి సిద్ధం చేస్తూ ఉండగా రెవెన్యూ శాఖ అధికారులు, విఆర్ఓ రమేష్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ నాగరాజ్‌లు అడ్డుకున్నారు. సాగుకు సిద్ధం చేస్తున్న వారిని ఇది ప్రభుత్వ భూమి అని, ఎవరు ఆక్రమించుకోకూడదని హెచ్చరించారు. పిఓబిలో ఉన్న భూములను ఆక్రమించుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇదే భూమిలో గత సంవత్సరం రెవెన్యూ శాఖ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇప్పుడు అవి లేక పోవడంతో మరలా ఏర్పాటు చేస్తామని తెలిపారు.

సీసీఎల్ సహకారంతో పాఠశాలల్లో గ్రానైట్ లేయింగ్

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: సీసీఎల్ ప్రొడక్ట్స్ ఇండియా లిమిటెడ్ వారి ఆర్థిక సహాయం, సిఎస్ఆర్ ఫండ్స్‌తో సంత వేలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 4 తరగతి గదులకు, వరండా పరిసర ప్రాంతాలకు గ్రానైట్ లేయింగ్ పనులను శుక్రవారం ప్రారంభించారు. లేయింగ్ పనుల నిమిత్తం పరిశ్రమ వారు సిఎస్ఆర్ ఫండ్స్ నుండి 1,52,000 రూపాయలు విడుదల చేశారు. ఈ పనుల పర్యవేక్షణకు సీసీఎల్ ప్రొడక్షన్ ఇండియా లిమిటెడ్ పరిశ్రమ సీనియర్ మేనేజర్ పబ్లిక్ రిలేషన్ కృష్ణ కిషోర్, కంపెనీ ప్లాంట్ హెడ్ సర్వేశ్వరరావు పాఠశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బాబు రెడ్డి, సుధాకర్, పాఠశాల యాజమాన్యం కమిటీ చైర్మన్ యుగంధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యులు టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి: త్రిపుర గవర్నర్



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: వైద్యరంగం అంటేనే వెలుగు చీకటి రెండు ఉంటాయని, డాక్టర్లు నూతన టెక్నాలజీని అంది పుచ్చుకొని ముందుకు వెళ్లాలని త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాల అలుమని అసోసియే షన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యరంగం అంటేనే వెలుగు చీకటి రెండు ఉంటాయనీ, అత్యవసర సేవలు అవసరమైనప్పుడు ఆదుకుంటే డాక్టర్లు దేవునితో సమానం అవుతారని తెలిపారు. డాక్టర్లు నూతన టెక్నాలజీని అడాప్ట్ చేసుకొని ముందుకెళ్లాలని సూచించారు. గుండె జబ్బు ల ఇంటర్వెన్షన్ నుంచి క్యాన్సర్ లక్షణాల చికిత్స వరకు అన్ని రంగాలలో ముందుం డాలన్నారు. అలుమని అసోసియేషన్ నెట్వర్క్ ఎంతోకాలంగా అన్ని విషయాలను ముందు కు తీసుకెళుతూ, అనేక రకాల యాక్టివిటీస్ చేపడుతుందని తెలిపారు. శ్రీ వెంకటేశ్వర మెడి కల్ కాలేజ్ నిపుణులైన వైద్యులనే కాక, జాతీయ ఆరోగ్య విధానాలను రూపొందించి, దూర దృష్టి ఉన్న డాక్టర్లను, తయారుచేసిందని తెలిపారు. ఈ కృషి అలుముని అసోసి యేషన్ చైర్ పర్సన్ రాయపు రమేష్ బాబు సాధ్యమైందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అలుమని అసోసియేషన్ నెట్వర్క్ వారు ప్రతి కాలేజీకీ సహకా రం అందిస్తా రని, తాను చదువుకున్న ఆంధ్ర కాలేజ్ కు కూడా సహకారం అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం , టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాష్, అలుమని అసోసియేషన్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్ పర్సన్, ప్రెసిడెంట్ రాయపు రమేష్ బాబు, ఎస్ వి మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ రవి ప్రభు, రుయా హాస్పిటల్ సూపర్డెంట్ రాధ, మెటర్నిటీ హాస్పిటల్స్ సూపర్డెంట్ పార్థసారథి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'ఫెర్టీ 9'లో 'ఎఐ' ఆధారిత పరీక్షలు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : ప్రపంచ ఐవిఎస్ దినోత్సవం సందర్భంగా తిరుపతి ఎయిర్‌బైపాస్‌రోడ్డులో 'ఫెర్టీ 9'లో ఎఐ ఆధారిత పురుష సంతానోత్పత్తి పరీక్షను ప్రారంభించినట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. అత్యాధునిక ఎఐ ఆధారిత సెమెన్ ఎనలైజర్, లెన్సూక్ ఎక్స్ 12 ప్రోను పరిచయం చేస్తూ, సంస్థ సంతానోత్పత్తి సంరక్షణ రంగంలో నూతన దిశను ప్రకటించింది. ఇది ఖచ్చితమైన రోగనిర్ధారణ, సమగ్ర పునరుత్పత్తి సంరక్షణ పట్ల నిబద్ధతను బలోపేతం చేస్తుంది. ఫెర్టీ 9 సహాయంతో గర్భధారణకు చేరుకుని విజయవంతంగా బిడ్డలను పొందిన జంటలు ఈ వేడుకలో పాల్గొని తమ ప్రయాణాన్ని పంచుకుంటూ, ఆశను పునరుజ్జీవింపజేసే తమ స్వంత కథలను అందించారు. 'టు గెదర్ ఇన్ ఐవిఎఫ్' ప్రచారానికి ప్రాతినిధ్యంగా నిలిచిన ప్రతీకాత్మక కేక్ కటింగ్ వేడుక, సంఘీభావాన్ని, సమిష్టి ఆశయాన్ని చాటి చెప్పారు. ప్రత్యేక సంతానోత్పత్తి అంచనా ప్యాకేజీని కేవలం రూ.599వద్ద అందిస్తోంది. ఇందులో సూపర్ స్పెషాలిటీతో సంప్రదింపులు, అల్ట్రాసౌండ్, ఎఎంహెచ్ టెస్ట్, వీర్య పరీక్షలు ఉంటాయి. అలాగే జులై 31 లోపు చికిత్స ప్రారంభించే జంటలకు ఐయుఐ చికిత్సపై 50 శాతం, ఐవిఎఫ్‌పై 25 శాతం రాయితీ లభిస్తుందని పేర్కొన్నారు.

విదేశీ మెడికల్ గ్రాడ్యుయేటర్లకు ఇంటర్న్‌షిప్ ఇవ్వాలి : ఎంపి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఆంధ్రప్రదేశ్‌లో విదేశీ మెడికల్ గ్రాడ్యుయేట్లు ఎదుర్కొంటున్న ఇంటర్న్‌షిప్ సమస్యల గురించి తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి పార్లమెంటులో ప్రశ్నించారు. ఇదే సమస్యపై గతంలో కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసిన ఎంపి శుక్రవారం మరోసారి పార్లమెంటు ద్వారా కేంద్ర ప్రభుత్వం దష్టికి తీసుకెళ్ళారు. ఇటీవల విదేశీ వైద్య గ్రాడ్యుయేట్ల నిరసన కార్యక్రమంలో చోటు చేసుకున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఒకే విధమైన నిబంధనలు ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ సమాధానమిస్తూ విదేశీ వైద్య గ్రాడ్యుయేట్లు భారతదేశంలో వైద్యం చేయడానికి లైసెన్స్, పర్మినెంట్ రిజిస్ట్రేషన్‌పొందడానికి నేషనల్ మెడికల్ కమిషన్ 2021లో జారీ చేసిన నిబంధనలు వర్తిస్తాయన్నారు.

ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌పై అసత్య ఆరోపణలు హేయం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎస్సీ ఎస్టీల అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌పై వైసీపీ నాయకులు అసత్య ఆరోపణలు చేయడానికి ఖండిస్తున్నామని వాస్తవాలు తెలుసుకొని వైసిపి నాయకులు మాట్లాడాలని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ మెంబర్ సురేంద్ర వెల్లడించారు. శుక్రవారం గూడూరు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టిడిపి ఎస్సీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు.

ప్రజాశక్తి - వాకాడు: గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ దళితుల సమస్యల పరిష్కారానికి ముందుంటారని టిడిపి వాకాడు మండల అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఇరిగేషన్ గెస్ట్ హౌస్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. వైసీపీ నేతలు ఎమ్మెల్యే పై చేసిన విమర్శల్లో వాస్తవం లేదన్నారు.

ప్రజాశక్తి - కోట : గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్‌పై వైసీపీ నాయకులు చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని కోట ఎంపీటీసీ దారా సురేష్, టిడిపి నాయకులు మీజూరు మల్లికార్జున్ రావు, తిరుమూరు మురళిలు పేర్కొన్నారు. శుక్రవారం కోట మండలంలోని టిడిపి సీనియర్ నాయకులు నల్లపురెడ్డి జగన్మోహన్ రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పాశి దళితుల అభవృద్ధికి తోడ్పడుతున్నారని, వైసీపీ నాయకులు చేసిన వ్యాఖ్యల్లో వాస్తవం లేదన్నారు.

ఓటరు జాబితా పారదర్శకంగా తయారు చేయాలి:సిపిఎం



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎన్నికల ప్రజాస్వామ్యానికి ప్రమాదమని, దొడ్డి దారిన అమలు చేస్తున్న పౌరసత్వ చట్టం సవరణను వ్యతిరేకించాలని పట్టణంలోనే స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్, పుత్తూరు పట్టణ కార్యదర్శి ఆర్ వెంకటేష్, కార్యకర్తలు కరపత్రాలు విడుదల చేశారు. ఆగస్టు నెలలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పౌరులందరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు నిర్వహించడం ఎన్నికల సంఘం బాధ్యత అన్నారు. ఓటర్ల పౌరసత్వంతో ముడి పెట్టరాదని టీడీపీ తమ ఆందోళనను ఎన్నికల సంఘం ముందు వ్యక్తం చేయాలన్నారు. మత ప్రాతిపదికను విభజించే బిజెపి కుట్రలను ప్రజలు ఐక్యంగా ప్రతిఘటించాలని, సిపిఎంపార్టీ విజ్ఞప్తి చేస్తూ ఆగస్టు 8న జరిగే నిరసనలో ప్రజలందరూ భాగ్యస్వాములై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు ఏ విజయ్, ధన, గోవింద్ స్వామి, రవి, సుబ్రహ్మణ్యం, కంద స్వామి, తదితరులు పాల్గొన్నారు.

టేప్ ఎక్స్ పోను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ది అసోసియేషన్ ఆఫ్ ప్లానర్స్ అండ్ ఇంజనీర్స్ (టేప్) ద్వారా ఎక్స్ పోను ఈనెల 26, 27వ తేదీలలో తిరుపతి నగర పరిధిలోని పిఎల్ఆర్ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహిస్తున్నామని, అందమైన ఇంటిని నిర్మించుకోవడానికి తగిన సలహాలు, సూచనలు పొందడానికి ఇది మంచి అవకాశం అని తిరుపతి నగర ప్రజలు ఈ ఎక్స్ పోను సద్వినియోగం చేసుకోవాలని టేప్ చైర్మన్ వెంకటేష్ బాబు, ప్రెసిడెంట్ ప్రసాద్ రెడ్డిలు కోరారు. శుక్రవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఎక్స్ పోకు సంబంధించిన బ్రౌచర్‌ను టేప్ సభ్యులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త ఇంటిని నిర్మించుకోవడానికి, పాత ఇంటిని మరమ్మత్తులు చేయించుకోవడానికి అందుబాటులో ఉన్న టెక్నాలజీని, మెటీరియల్ కాంపోనెంట్స్ ను ఈ ఎక్స్ పోలో 70 స్టాల్స్ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. ప్రముఖ కంపెనీలు వినియోగించే మెటీరియల్స్, టెక్నాలజీని ప్రజలు నేరుగా కంపెనీ ప్రతినిధులను సంప్రదించి వారి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చున్నారు. టేప్ ఎక్స్ పో ప్రారంభ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని వివిధ నియోజకవర్గాలకు సంబంధించి శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, ప్రజా ప్రతినిధులు హాజరవుతున్నారన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు : తహశీల్దార్

ప్రజాశక్తి - రేణిగుంట : రేణిగుంట మండలం వెంకటాపురం పంచాయతీ వినాయక నగర్‌లో సర్వే నంబర్ 380నందు 65.2 సెంట్లు చెరువును ఆక్రమించి 27 రేకుల షెడ్డులను వేసి ఆక్రమించినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. శుక్రవారం మధ్యాహ్నం రేణిగుంట అర్బన్‌పోలీసులు, ఇరిగేషన్ ఎఇ సమక్షంలో రేణిగుంట తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి సారథ్యంలో జేసీబీల సాయంతో ఆక్రమణలను తొలగించారు. ప్రభుత్వ స్థలాల్లో చెరువులను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గాంధీ విగ్రహ ధ్వంసంపై ఆగ్రహం

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట మండలం పుదూరు గ్రామంలో జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సిపిఎం నాయకులు శివకవి ముకుంద అన్నారు. శుక్రవారం ప్రజాసంఘాల నాయకులతో కలిసి ఎంపిడిఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. శివకవి ముకుంద మాట్లాడుతూ గురువారం సాయంత్రం నాలుగుగ ంటలకు గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసి 24 గంటలు కావస్తున్నా అధికారులు విచారణ చేపట్టకపోవడం అన్యాయమన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహాత్మాగాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మనోజ్, గణేష్, ఆవాజ్ మండల కమిటి అధ్యక్షులు హలీమ్, ఖాన్, ఎస్‌కె అబ్దుల్లా, అన్సర్, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు వేలు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో రాష్ట్రం : మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆంధ్ర రాష్ట్రానికి సుపరిపాలన అందించడం వల్లే రాష్ట్రం అభివద్ధి పథంలో పయనిస్తుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శుక్రవారం తిరుపతి నాలుగో డివిజన్‌లో సుపరి పాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.మంత్రి మాట్లాడుతూ వైసీపీ హయాంలో అభివద్ధి కుంటుపడిందని, కక్షలు, దౌర్జన్యాలు, బెదిరింపులు, కబ్జాలు పాలన చేయడం వల్ల రాష్ట్రం అభివద్ధిలో అట్టడుగు స్థాయికి చేరుకుందన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వడం వల్ల రాష్ట్రం అభివద్ధి పరుగులు తీస్తుందన్నారు. దీన్ని చూసి వైసిపి అధినేత జగన్ ఓర్వలేక రాష్ట్ర ప్రభుత్వంపై అభాండాలు వేస్తున్నారని, అడుగడుగున రాష్ట్ర అభివద్ధిని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఆగస్టు నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. మహిళలకు సంవత్సరానికి మూడు ఉచిత సిలిండర్లతో పాటు రైతు భరోసా కూడా చెల్లించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే తల్లికి వందనం పేరుతో విద్యార్థికి తల్లి ఖాతాలో 15వేల రూపాయలు ఇస్తున్నామని వెల్లడించారు. చంద్రబాబు తోనే రాష్ట్ర అభివద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మన్నూరు సుగుణమ్మ, నరసింహయాదవ్, ఆర్‌సి మునికృష్ణ, చినబాబు, ఎన్.విజయకుమార్ పాల్గొన్నారు.

మంత్రి రామానాయుడును సత్కరించిన డాక్టర్ హరి ప్రసాద్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమానికి తిరుపతికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ మంత్రి నిమ్మల రామానాయుడుకి కలంకారీ శాలువా కప్పి కందూరు నరసింహస్వామి ప్రతిమను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్త కళా నైపుణ్యాభివద్ధి సంస్థ చైర్మన్, జనసేన పార్టీ పిఎసి సభ్యులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరి ప్రసాద్ అందజేశారు. సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనేందుకు తిరుపతికి వచ్చిన మంత్రి, డాక్టర్ హరి ప్రసాద్ ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రిని ఆయన సత్కరించారు.

దళారులతో ప్రయివేటు సెక్యూరిటీ కుమ్మక్కు

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల శ్రీవారి సర్వదర్శనం సులభంగా చేయిస్తామని చెప్పి కొందరు దళారులు ముఠాగా ఏర్పడి దందాలకు పాల్పడుతున్నారు. టిటిడి ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందితో కుమ్మక్కై, భక్తుల వద్ద అక్రమంగా నగదు తీసుకుంటున్న ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. తిరుమల టూటౌన్ పీఎస్ సీఐ శ్రీరాముడు తెలిపిన వివరాల ప్రకారం, ఈనెల 23న అలిపిరి వద్ద ఉన్న భూదేవి కాంప్లెక్స్‌లో ఎస్ఎస్‌డీ టోకెన్ల కోసం వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు వేచి ఉన్నారు. వారిలో సుమారు 24 మంది భక్తులతో దళారులైన ట్యాక్సీ డ్రైవర్‌లు కె.వెంకటేష్, డి.వెంకటేష్ మాట్లాడారు. క్యూలైన్‌లో లేకుండా నేరుగా ఉచిత దర్శనం ఏర్పాటు చేస్తామని చెప్పి ప్రతి ఒక్కరి నుంచి రూ.1500 చొప్పున తీసుకునేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. తిరుమలకు వారి వాహనాలలో తీసుకువచ్చారు. అనంతరం తిరుమలలో ఉన్న మరో దళారి, వాహన క్లీనర్ వెంకటేష్‌కి రూ.8,500 ఇచ్చాడు. అతడు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2 వద్ద విధులు నిర్వహించే ప్రైవేటు సెక్యూరిటీ గార్డు (పీఎస్‌జీ) పి.సాయికుమార్‌కి రూ.8000 అతని వాటా ఇవ్వగా, సాయికుమార్ గేట్ తాళం చెవిని వాహన క్లీనర్‌కు అందించాడు. ఉదయం సుమారు 8 గంటల సమయంలో తిరుమలలోని వైకుంఠం క్యూకాంప్లెక్స్-2 ప్రధాన ప్రవేశద్వారం సమీపంలో, సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఎమర్జెన్సీ గేట్ తాళాలను తెరిచి ఆ భక్తులను అక్రమ మార్గంలో టోకెన్ కోసం పంపారు. ఆ భక్తులు టోకెన్ పొందిన తర్వాత వెలుపలకు వచ్చి తిరిగి మధ్యాహ్నం 12.30 గంటలకు రీఎంట్రీ (యాక్సెస్‌కార్డు ఎంట్రీ) ద్వారా ప్రవేశించారు. ఈ క్రమంలో విజిలెన్స్ అధికారులకు అనుమానం వచ్చి విచారించగా దళారుల వివరాలు వెలుగులోకి వచ్చాయి. వెంటనే భక్తులను మోసగించిన ముగ్గురు దళారులు, టిటిడి పీఎస్‌జీపై తిరుమల టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


క్రైం న్యూస్

కుక్కను తప్పించబోయి కారు బోల్తా



ప్రజాశక్తి - పెళ్లకూరు: పెళ్లకూరు మండలం, కొత్తూరువద్ద నేషనల్ హైవే పై శుక్రవారం ఉదయం అమలాపురం నుండి తిరుపతి వెళుతున్న కారు కుక్కను తప్పించబోయి సడన్ బ్రేక్ వేసి ఎడమ చేతి వైపు ఐరన్ డివైడర్‌ను ఢీకొట్టి పంట పొలాల్లో బోల్తాపడింది. కారులో ప్రయాణిస్తున్న ఉదయ్ కిరణ్ (27) సిహెచ్ ధన శేఖర్ (29) సిహెచ్ నవ సతీష్ (29) సిహెచ్ శివ సాయి(25) నలుగురికి గాయాలయ్యాయి. 108 సహాయంతో చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వాసుపత్రికి స్థానికులు తరలించారు.

వేస్ట్ మెటీరియల్ ఐరన్ లోడ్ లారీ బోల్తా



ప్రజాశక్తి - పెళ్లకూరు : పెళ్లకూరు మండలం, నేషనల్ హైవే పై శుక్రవారం ఉదయం పెళ్లకూరు బ్రిడ్జి వద్ద తిరుపతి వైపు నుండి అమ్మన్ ట్రెఫ్యాక్టరీకి ఐరన్ వేస్ట్ మెటీరియల్ తీసుకు వెళుతున్న లారీని, వెనుకనుండి మరో వాహనం ఢీకొని వెళ్లిపోగా, లారీ బోల్తా పడింది. సమాచారం అందుకున్న మొబైల్ డ్యూటీలో ఉన్న మైకేల్ ఘటనా స్థలానికి చేరుకొని రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న వాహనాన్ని పక్కకు జరిపించారు. రాకపోకలకు అంతరాయం లేకుండా చేసి, పెళ్ళకూరు పోలీస్ వారికి సమాచారం ఇచ్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



శివకేశవులు మృత దేహం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: సూళ్లూరుపేట, తహశీల్దారు కార్యాలయం పక్కనే ఉన్న చెట్టుకు వట్రపాలెంకు చెందిన శివకేశవులు (52) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై బ్రహ్మనాయుడు ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు. ఇది ఆత్మహత్య కాదా అన్నది దర్యాప్తులో తేలాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

థియేటర్ ధ్వంసంలో వ్యక్తుల బైండోవర్



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: హరి హర వీరమల్లు ప్రీమియర్ షో ప్రదర్శనలో ఆర్ఆర్ థియేటర్ వద్ద నానా హంగామా సృష్టించి, అద్దాలు ధ్వంసం చేసిన ఘటనలో బాధ్యులైన చందు, రవి అనే వ్యక్తులను శుక్రవారం బైండోవర్ చేసుకున్నట్లు వన్ టౌన్ సీఐ గోపి తెలిపారు. ఈ నెల 23వ తేదీ అర్ధరాత్రి హరిహర వీరమల్లు చిత్రప్రదర్శన సందర్భంగా ఆకతాయిలు హంగామా చేసి ఆర్ఆర్ థియేటర్ మెయిన్ గేటు అద్దాలు ధ్వంసం చేశారు. థియేటర్ యాజమాన్యం ఫిర్యాదు మేరకు చందు, రవిని అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం శ్రీకాళహస్తి తహశీల్దార్ జనార్ధన రాజు ఎదుట హాజరపరిచారు.

పారిపోయి వచ్చిన విద్యార్థుల అప్పగింత



ప్రజాశక్తి - తిరుపతి సిటి : అనంతపురం జిల్లా నుండి పారిపోయి వచ్చిన నలుగురు విద్యార్థులను తిరుమల టూ టౌన్ పోలీసులు పట్టుకుని, అనంతపురం పోలీసులకు అప్పగించారు. బాబు(14), నవదీప్ (14), మణికంఠ (13), మంణికంఠ (12) నలుగురు విద్యార్థులు అనంతపురం, బాలుర వసతి గృహంలో ఉంటూ నేతాజీ స్కూల్‌లో చదువుతున్నారు. వీరు సరిగా చదవడం లేదని ప్రధానోపా ధ్యాయురాలు శ్రీదేవి మందలించడంతో గురువారం స్కూలునుండి హాస్టల్‌కు తిరిగి వెళ్లకుండా పారిపోయారు. హాస్టల్ వార్డన్ ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. వారు తిరుమలలో ఉన్నట్లు సమాచారం అందుకున్న తిరుమల పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి అలిపిరి మెట్ల మార్గంలో తిరుపతి వైపుగా క్రిందకు వెళుతున్నట్లు గమనించి నలుగురు పిల్లలని పట్టుకొని వారికి కౌన్సిలింగ్ ఇచ్చి అనంతపురం 3 టౌన్ పోలీసులకు అప్పగించారు.

విజయానంద్‌ను కలిసిన ఏపీజీఈఏ కార్యవర్గం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయనంద్‌ను ఇటీవల నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యవర్గ అధ్యక్షులు సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ సహా 23 మంది మర్యాదపూర్వకంగా కలిసి ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను, రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశార్చు. సచివాలయంలో ఆయనను కలిసి 27 అంశాల జాబితాను అందించారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులు టెక్నికల్ ఎడ్యుకేషన్ శాఖలో పాలిటెక్నిక్ లో పనిచేసే టీచింగ్, అకాడమిక్ స్టాఫ్ ఉద్యోగులకు ఏఐసిటిఈ నిబంధనల మేరకు 2016 పే స్కేల్ ని అమలు చేసిన వేతన బకాయిలు ప్రభుత్వం వద్దనే రూ.191.13 కోట్ల రూపాయలు ఉన్నాయని, వీటిని తక్షణం విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో గుర్తింపు సంఘాల వ్యవస్థను క్రమబద్ధీ కరించాల్సిన అవసరం ఉందని, ఇందుకు రెండు మూడు సంవత్సరాల కాలపరమితి ఒకసారి ప్రధాన గుర్తింపు సంఘాన్ని ఉద్యోగులు నేరుగా ఎన్నుకునేలా ఒక విధానాన్ని రూపొందించాలన్నారు. ఈ సందర్భంగా ఏపీజిఈఏ కార్యవర్గ సభ్యులను ప్రత్యేకంగా సిఎస్ అభినందించారు. ఏపీజిఈఏ కార్యవర్గం ఇచ్చిన వినతపై సిఎస్ సానుకూలంగా స్పందించారన్నారు. సీఎస్ ను కలిసిన వారిలో ఏపీజీఈఏ సహాధ్యక్షులు సుగుణ, ఉపాధ్యక్షులు రాజ్ కుమార్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాలు ధ్వంసం చేయడం అభివృద్ధా..?



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనుల పేరిట వేసిన శిలాఫలకాలను ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ధ్వంసం చేయడం అభివృద్ధి కిందకు వస్తుందా అని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి విమర్శించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ, తుడా చైర్మన్ పర్యటనలో భాగంగా ఏపీ సీడ్స్ శివ సర్కిల్, ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి, సుబ్రమణ్య స్వామి కొండ, బసవయ్య పాలెం నంది సర్కిల్ వద్ద గత ప్రభుత్వ హయాంలో వేసిన శిలాఫలకాలను ఎమ్మెల్యే అనుచరులు ధ్వంసం చేయడాన్ని ఖండిస్తూ శుక్రవారం నిరసన తెలిపారు. మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి చిత్రపటానికి వినతి పత్రం అందజేసి సుధీర్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని విజ్ఞప్తి చేశారు. అంజూరు శ్రీనివాసులు, ఉన్నం వాసు దేవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీడబ్ల్యూ జూనియర్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్ కౌన్సిలింగ్ ప్రక్రియలో భాగంగా శుక్రవారం జరిగిన మొదటిరోజు కౌన్సిలింగ్ లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈ సి సీట్లు భర్తీ చేయడం జరిగింది. శనివారం మిగిలిన సిఇసిలో 36 సీట్లు, హెచ్ఇసిలో 65సీట్లు కళాశాల సీట్లు ఖాళీగా ఉన్నాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భువనేశ్వరి తెలియజేశారు.

యస్వీయూలో అనవసర ఫ్లెక్సీలు పెట్టకూడదు


ప్రజాశక్తి - క్యాంపస్: యస్వీయులో ఇక నుంచి విద్యా విషయక బ్యానర్లు, ఫ్లెక్సీలు తప్ప వేరే వాటిని పెట్టకూడదని విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అప్పారావు ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవల కాలంలో విశ్వవిద్యాలయంలో విద్యా వాతావరణాన్ని కలుషితం చేసే విధంగా ఫ్లెక్సీల సంస్కృతి పెరిగిపోయిందని, వాటి వల్ల విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారని, బయటనుంచి వచ్చే సైంటిస్టులు, మేధావులు వింతగా చూస్తున్నారని, అందుకే విశ్వవిద్యాలయంలో ఇలాంటి వాటిని అనుమతించబోమని వారు తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ సంఘాల నాయకులు, ఈ విషయంలో స్పందించి విశ్వవిద్యాలయంలో విద్యావాతారణాన్ని పెంపొందించాలని కోరారు.

ప్రజలకు ఉపయోగపడే విధంగా విధులు నిర్వహించాలి



ప్రజాశక్తి- కోట: కోట మండలంలోని కేశవరం సచివాలయ కేంద్రంలో చిట్టేడు సొసైటీ చైర్మన్ చాపల శ్రీనివాసులు ఆధ్వర్యంలో సచివాలయ కేంద్రానికి నూతనంగా విచ్చేసిన ఉద్యోగస్తులను శుక్రవారం ఘనంగా ఆహ్వానించారు. ఈ సమావేశంలో చిట్టేడు సొసైటీ చైర్మన్ చాపల శ్రీనివాసులు మాట్లాడుతూ పంచాయితీలోని ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారికి కావలసిన పనులను సకాలంలో అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నాగూర్, వేణు, సచివాలయ ఉద్యోగస్తులు తదితర స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరిహారం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కోడూరు మామిడికాయల లారీ ఘటనలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలకు శుక్రవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని కలవకుంటకు ఎస్టీ కాలనీకి చెందిన చిట్టెమ్మ, చుక్కలనిడిగిల్లు ఎస్టీ కాలనీకి చెందిన రాధా, ఆమె కుమారుడు జానీ, గుండ్లపల్లి చంద్ర శ్రీను మామిడికాయల లారీ బోల్తా పడి మరణించారు. వీరి కుటుంబాలకు రూ. 3లక్షలు చొప్పున ఎమ్మెల్యే చెక్కుల రూపంలో అందజేశారు.

టిడిపిలోనే బీసీలకు సముచిత స్థానం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టీడీపీలోనే బీసీలకు సముచిత స్థానం దక్కుతుందని ఆ పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.ఎం.ఉమేష్ రావు పేర్కొన్నారు. టీడీపీ సీనియర్ నేత, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి కె.రామచంద్రయ్యను 9వ వార్డు అధ్యక్షుడిగా నియమించడం పట్ల ఆయనను బీసీ నేతలు శుక్రవారం అభినందించారు. శుభాకాంక్షలు తెలియజేశారు. రామచంద్రయ్య నిబద్ధత కలిగిన నేతని కొనియాడారు. ఆయనకు నామినేటెడ్ పదవి దక్కాలని ఆకాంక్షించారు. మిన్నల్ రవి, మహబూబ్ బాషా, వజ్రం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 15న గృహప్రవేశాలు



ప్రజాశక్తి - తిరుపతి టౌన్:ఆగస్టు 15 నాటికి తిరుపతి జిల్లాలో 14,001 వేల ఇళ్లను గృహప్రవేశాలు చేయించాలని అందుకు అధికారులు తగ్గట్టుగా పనులు చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ఎండి శివ ప్రసాద్ వెల్లడించారు. శుక్రవారం జిల్లాలో గృహనిర్మాణ శాఖ యండి శివప్రసాద్ చిందేపల్లె, ఊరందూరులోని పిఎంఎవై- ఎన్టీఆర్ నగర్ లేఔట్లను సందర్శించి గృహనిర్మాణాలు పురోగతి పై అధికారులతో కలిసి పర్యటించారు. తిరుపతి, శ్రీనివాస ఆడిటోరియంలో గృహనిర్మాణాల పురోగతి పై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల గృహప్రవేశలలో భాగంగా, తిరుపతి జిల్లాలో దాదాపు 14,001 ఇళ్లను లబ్ధిదారులచే 15 ఆగస్టు, 2025 కల్లా గృహప్రవేశాలను చేయించాలనే లక్ష్యంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారి, దయాకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, మండల ఇన్చార్జులు, గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు /వార్డు ఆమెనేటి సెక్రటరీలు, సి ఎల్ టి సి లు తోపాటు ఇతర గృహనిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన 'అమ్మ చెక్కిన బొమ్మ'

ప్రజాశక్తి -తిరుపతి సిటీ :అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ నాటకోత్సవంలో భాగంగా శుక్రవారం ఏర్పాటుచేసిన అమ్మ చెక్కిన బొమ్మ సాంఘిక నాటక ప్రదర్శన పలువురుని ఆలోచింపజేసింది. స్థానిక మహతి ఆడిటోరియంలో శుక్రవారం రాత్రి హైదరాబాదుకు చెందిన గోవాడ క్రియేషన్స్ కళాకారులచే అమ్మ చెక్కిన బొమ్మ సాంఘిక నాటకం ప్రదర్శించారు. చందమామపై నివాసాన్ని ఏర్పరచుకొనే సాంకేతికత కలిగిన నేటి ఆధునిక సమాజంలో కూడా ఇంకా జబ్బులు చరుచుకుంటూ అలాంటి వారికి సముచిత స్థానాన్ని కలగజేయకపోవడం మన నాగరికతలో మనం ఒప్పుకోవడానికి సిద్ధపడని డొల్లతనము కాదా.? అని ప్రశ్నించారు. అంతకుముందు ప్రదర్శించిన ఖడ్గ తిక్కన్న పౌరాణిక పద్య నాటిక ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అభినయ ఆర్ట్స్ అధినేత బి.యన్.రెడ్డి, ఆ సంస్థ ప్రతినిధులు కళాకారులు పాల్గొన్నారు.

సుపరిపాలనలో తొలి అడుగు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఆదేశాల మేరకు పుత్తూరు రూరల్ క్లస్టర్ ఇంచార్జ్ గంజి మాధవయ్య ఆధ్వర్యంలో రామక్రిష్ణాపురం గ్రామపంచాయతీ, 38వ బూత్‌లో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఏడాదిగా కూటమి పరిపాలనలో అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు రూరల్ మండల టీడీపీ అధ్యక్షులు అరవ బాలాజీ, ప్రధానకార్యదర్శి హేమంత్, బూత్ ఇంఛార్జి హరి, తడుకు సింగిల్ విండో డైరక్టర్ విజయభాస్కర్ రెడ్డి, టీడీపీ నాయకులు గంజి వరప్రసాద్, తిరుమలరావు, కె.మనోహర్, వెంకటేష్, గిరిప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -ఏర్పేడు : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే బొజ్జల, తుడా చైర్మన్ సుడిగాలి పర్యటనలో భాగంగా శుక్రవారం ఏర్పేడు మండలం, మునగల పాలెంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ భార్గవి, ఎంఈఓ ప్రేమలత, శ్రీకాళహస్తి మాజీ మార్కెట్ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు, ఏర్పేడు టిడిపి మండల అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు, సీనియర్ నాయకులు ధనుంజయ నాయుడు, నైనారు పున్నారావు, సూరి నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

1 నుండి ఆన్‌లైన్‌లో హోమం టికెట్లు

ప్రజాశక్తి - తిరుపతి సిటి: తిరుపతి, అలిపిరిలోని సప్త గోప్రదక్షిణ మందిరంలో టీటీడీ ప్రతి రోజు నిర్వహించే శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహం టికెట్లును ఆగస్టు 1వ తేదీ నుండి ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేస్తారు. ప్రతి రోజు భక్తులకు కరెంటు బుకింగ్ ద్వారా 50 టికెట్లు, ఆన్‌లైన్‌లో150 టికెట్లు జారీ చేస్తున్న విషయం తెలిసిందే. భక్తుల విజ్ఞప్తి మేరకు ఆగస్టు 1వ తేదీ నుండి మొత్తం 200 టికెట్లు ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయాలని టీటీడీ నిర్ణయించింది. కావున భక్తులు ఈ విషయాన్ని గమనించి టికెట్లు బుక్ చేసుకోవాలని కోరడమైనది. భక్తుల కోరిక మేరకు శ్రీవారి పాదాల వద్ద తమ శుభకార్యాలు, విశేషమైన రోజుల్లో స్వామివారి అనుగ్రహం కోసం సంకల్పం చెప్పుకుని యజ్ఞం నిర్వహించేలా టీటీడీ ఏర్పాట్లు చేసింది. ఈ విశేష హోమంలో రూ.1600/- చెల్లించి గృహస్తులకు (ఇద్దరు) పాల్గొనవచ్చు. హోమంలో పాల్గొన్న గృహస్తులకు రూ.300/- ప్రత్యేక ప్రవేశ దర్శనం కల్పిస్తారు.

ఫీజుల బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - క్యాంపస్: తల్లికి వందనం, పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్లను త్వరితగతిన విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ ఆధ్వర్యంలో ఎంఆర్ పల్లి వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ఓ తిరుపతి జిల్లా కార్యదర్శి ఆష మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్మెంట్ ఒక క్వార్టర్‌కు 700 కోట్లు, వసతిదీవెన 1,100 కోట్లు చొప్పున ఒక సంవత్సరానికి 3,900 కోట్లు చెల్లించాలని తెలిపారు. మొత్తంగా రెండేళ్లకు 7,800 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉండగా ఇప్పటికి కేవలం రూ.1,400 కోట్లు మాత్రమే విడుదల చేసిందన్నారు. ఇంకా 6400 కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. ఫీజులు కట్టనందున సర్టిఫికేట్లు ఇవ్వడంలేదని, కౌన్సిలింగ్ ప్రారంభమయ్యే నాటికి తమ చేతుల్లో ఈ సర్టిఫికెట్లు లేకపోతే అనర్హులుగా మిగిలిపోతారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు చెల్లించవలసిన పూర్తి ఫీజు రియంబర్స్మెంట్లను విడుదల చేయాలని పిడిఎస్ఓ తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ఓ సభ్యులు దేవేంద్ర, బాలాజీ, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



వైభవోపేతంగా అర్జున తపస్మాన్

ప్రజాశక్తి - రామచంద్రాపురం : మండలంలోని చుట్టుగుంట రామాపురంలో శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి వార్షిక మహాభారత ఉత్సవాలలో భాగంగా అర్జున తపస్మాన్ కార్యక్రమం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. దిగువ రామాపురం గ్రామానికి చెందిన మాజీ సింగల్ విండో డైరెక్టర్ ముద్దుకృష్ణారెడ్డి, అచ్చమ్మ దంపతులు అర్జున తపస్మాన్ కార్యక్రమానికి ఉభయ దాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు లేని వారు వరపడి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



గంజాయి తరలిస్తూ ముగ్గురు అరెస్ట్

10 కేజీల గంజాయి స్వాధీనం



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులు అదుపులో తీసుకొని వారి వద్ద నుంచి పది కేజీలు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వెస్ట్ పోలీసులు తెలిపారు. పోలీసులకు కథనం మేరకు తిరుపతి భవాని నగర్‌కు చెందిన వేలూరు హరికృష్ణ, అశోక్ నగర్‌కు చెందిన పెద్దరామన్న గారి ఆకాష్, బైరాగి పట్టెడకు చెందిన రెడ్డి చర్ల అరుణ్ కుమార్ గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసుల నిఘాలో వెల్లడయింది. స్థానిక నరసింహ తీర్థం రోడ్, స్కూల్ వద్ద ముద్దాయిలను అదుపులోకి తీసుకున్నారు. తిరుపతికి చెందిన ప్రధాన ముద్దాయి నితిన్ కోసం గాలింపు చేపట్టారు వారి పై కేసు నమోదు చేసి, పట్టుబడ్డ ముగ్గురిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వెస్ట్ సీఐ మురళీమోహన్ రావు వెల్లడించారు.

చేతిపంపు మరమ్మతు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి చొరవతో ఎన్టీఆర్ నగర్ లో ఉన్న పాత చేతి బోరుకు శుక్రవారం మరమ్మత్తులు చేశారు. దశాబ్దాలుగా ఎన్టీఆర్ నగర్ వాసుల దాహార్తిని తీరుస్తున్న చేతి బోరు మరమ్మత్తుల గురైంది. గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో వెంటనే పరిష్కరించినట్లు ఆ వార్డు ఇన్చార్జి నెమళ్ళూరు బుజ్జి తెలిపారు.

టిటిడికి రూ.20లక్షలు విరాళం





ప్రజాశక్తి - తిరుమల:టీటీడీకి దాతలు రూ.20 లక్షల విరాళం అంద జేశారు. తిరుపతికి చెందిన ఎల్వీ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చైర్మన్ పి.సి రాయల్ శుక్రవారం శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు, బెంగళూరుకి చెందిన సుకుమార్ శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి రూ.10లక్షలు విరాళంగా అందించారు. దాతలు అదనపు ఈవో వెంకయ్య చౌదరికి విరాళం డీడీలు అందజేశారు.

ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :గూడూరు, జడ్పీ హైస్కూల్ రోడ్‌లో ఉన్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటి: తిరుపతి, మంగళం రూరల్ సెక్షన్‌లో మునిసిపల్ కార్పొరేషన్ అండర్ డ్రైనేజీకి సంబంధించి విద్యుత్ లైన్లు మరమ్మత్తులు కారణంగా శనివారం, ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీ ఎస్పీడీసీఎల్ ఆపరేషన్ టౌన్ డివిజన్ ఈఈ విన్న కోటిచంద్ర శేఖర్ రావ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ:సీఎం ఆర్ ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గురువారం సాయంత్రం తన నివాసంలో అందచేశారు. 20వ డివిజన్ పరిధిలోను ఎంఆర్ పల్లికి చెందిన పుష్యమికి రూ.3 లక్షల 39 వేల 154 రూపాయల చెక్‌ను, మధురానగర్‌కు చెందిన లలితకు 41వేల 12రూపాయల చెక్‌ను ఎమ్మెల్యే అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రవి, ముని ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆమందూరులో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి -ఏర్పేడు :ఏర్పేడు మండలం, ఆమందూరు గ్రామ పంచాయతీలో స్విమ్స్ పింక్ బస్ ఆధ్వర్యంలో శుక్రవారం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ వైద్యురాలు చైతన్య భాను, ఏర్పేడు పిహెచ్సి వైద్యురాలు డాక్టర్ లావణ్య, స్విమ్స్ వైద్య సిబ్బంది, సర్పంచ్ బొడుగు బాల గురునాథం యాదవ్, పంచాయతీ కార్యదర్శి కిషోర్, సచివాలయం సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.